సాక్షి
రంగారెడ్డి

శనివారం । 10 । ఆగస్టు । 2024



అక్రమాలకు పాల్పడితే..

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. 8లో▸



మూడు నెలల్లో పరిష్కారం

సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. 8లో▸



ఆపరేషన్‌కు తీసుకెళ్లి..

కాలికి గాయమై నడుచుకుంటూ ఆస్పత్రికి వెళ్లిన తన భార్యను.. శవంగా తిరిగిచ్చారని మృతురాలి భర్త రోదించాడు. 8లో▸

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్



మోకిలలో మొక్క నాటి నీరు పోస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

శంకర్‌పల్లి: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మున్సిపాలిటీతో పాటు మండలంలోని మోకిల గ్రామంలో శుక్రవారం ఆమె పర్యటించారు. మున్సిపాలిటీలోని 4,5వ వార్డుల్లో చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం డంపింగ్ యార్డుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి రమాదేవి, విద్యాధికారి అక్బర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులు పండించిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అధికారులకు సూచించారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఫిరోజ్‌గూడ రెవెన్యూలో రైతులు పండించిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల ప్రక్రియను సర్వే నంబర్ ఆధారంగా పరిశీలించాలని తెలిపారు. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర పంటల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వరప్రసాద్‌రెడ్డి, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మంచాలలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

మంచాల: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అన్నారు. మంచాల, తాళ్లపల్లిగూడ, ఆరుట్ల గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛదనం– పచ్చదనంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, మండల ప్రత్యేకాధికారి సుభాషిణి ఎంపీడీఓ బాలశంకర్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వనాలను కాపాడుకుందాం

ఇబ్రహీంపట్నం రూరల్: అంతరించిపోతున్న వనాలను కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం పోల్కంపల్లి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో ఆరువేల మొక్కలకు తగ్గకుండా నాటాలని అన్నారు. రైతులు తమ పొలం గట్లపై ఆదాయాన్నిచ్చే పండ్లు, టేకు, మలబార్, వేపలాంటి మొక్కలు నాటుకొని ఆదాయం పొందాలని సూచించారు. తరిగిపోతున్న పచ్చదనాన్ని పెంపొందించుకోకపోతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నవీన్ కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ లక్పతి నాయక్, ఏపీఓ తిరుపతాచారి, పంచాయతీ కార్యదర్శి రాధ, ఈసీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారూ మాఫీ చేయరూ..

రుణమాఫీపై రైతుల్లో మిశ్రమ స్పందన

- అయినవారిలో ఆనందం
- కాని వారిలో నిర్వేదం
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- సాంకేతిక సమస్యలే కారణమంటున్న అధికారులు
- ఆందోళన వద్దని, అర్హులందరికీ వస్తుందని భరోసా

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రుణమాఫీ పథకం వర్తింపుపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొంతమంది రైతులు తమకు మాఫీ అయిందని సంతోషం వ్యక్తం చేస్తుండగా.. మరికొందరు తమ పేరు లిస్టులో లేదని, మాఫీ కాలేదని ఆందోళన చెందుతున్నారు. తమకు ఎందుకు మాఫీ కాలేదని పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం పట్టుకుని బ్యాంకులు, పీఏసీఎస్ కార్యాలయాలు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అర్హత ఉండి, మాఫీ కాని వారు వ్యవసాయ అధికారుల దృష్టికి తేవాలని ప్రభుత్వం చెప్పడంతో మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే కుటుంబ నిర్ధారణకు సంబంధించిన వివరాలు సరిగా లేక.. చాలావరకు సాంకేతిక కారణాలతో మాఫీ కానట్టు అధికారులు చెబుతున్నారు.

– మరిన్ని వివరాలు 8లో

కొర్రీలు పెట్టొద్దు



కడ్తాల్: నా పేరున 3.02 ఎకరాల పొలం ఉండగా రూ.1.46 లక్షలు పంట రుణం తీసుకున్నా. నా భార్య పేరిట ఎకరం పొలం ఉండగా రూ.44 వేలు తీసుకున్నాం. కేసీసీ కింద మా అమ్మకు 2021లో ప్రభుత్వం పశుపోషణ నిమిత్తం రూ.38 వేల రుణం మంజూరు చేసింది. తీసుకున్న రుణాలను ఏటా రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నాం. ఇంట్లో ముగ్గురి పేర తీసుకున్న రుణం రూ.2.28 లక్షలు. రేషన్ కార్డు ప్రాతిపదికన ఈనెల 15న ప్రభుత్వం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని చెబుతోంది. మాఫీ అవుతుందో లేదోనని ఆందోళనగా ఉంది. కొర్రీలు పెట్టకుండా కచ్చితంగా రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలి.

– కె.కృష్ణయ్య, రైతు, చల్లంపల్లి, కడ్తాల్ మండలం

విడతల వారీతో ఆలస్యం



కడ్తాల్: నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఎకరాకు రూ.40 వేల చొప్పున రూ.1.60 లక్షలు రుణం తీసుకున్నాను. ఇప్పటి వరకు రూ.లక్షన్నర వరకు తీసుకున్న రైతులకే మాఫీ డబ్బులు ఖాతాల్లో జమ చేశారు. ఒకేసారి మాఫీ జరిగి ఉంటే త్వరగా కొత్త రుణం తీసుకుని పంటల సాగుకు ఉపయోగించే వాడిని. విడతల వారీగా ఇస్తుండటంతో ఆలస్యం అవుతోంది. రుణమాఫీ డబ్బులు ఖాతాలో ఎప్పుడు జమ చేస్తుందా అని ఎదురు చూస్తున్నాను.

– వాక్డోవత్ హర్యానాయక్, గుర్లకుంటతండా, కడ్తాల్ మండలం

అప్పుడేమో మాఫీ అని..



యాచారం: స్థానిక ఎస్‌బీఐలో పట్టాదారు, పాసుపుస్తకాలు పెట్టి మూడేళ్ల కింద రూ.70 వేల రుణం తీసుకున్నా. అప్పట్లో వడ్డీతో కలిపి రూ.లక్ష మాఫీ అయిందని ఫోనుకు మెసేజ్ వచ్చింది. ఇప్పుడు బ్యాంకుకు పోయి అడిగితే అప్పుడు కాలే.. ఇప్పుడు కాలే అంటున్నారు. నీ పేరు మీద మొత్తం రూ.1.30 లక్షలు బాకీ ఉంది, పూర్తిగా కట్టాలని చెబుతున్నారు. ఇదెక్కడి మాఫీనో అర్థం కావడం లేదు.

– నక్క అయిలమ్మ, మహిళా రైతు, మొండిగౌరెల్లి

మాఫీ కాలేదు



ఇబ్రహీం పట్నం: రూ.50 వేలు పంట రుణం తీసుకున్నాను. రెండు విడతలుగా రుణ మాఫీ జరిగినా నాకింకా మాఫీ కాలేదు. వ్యవసాయ కార్యాలయానికి వచ్చి అడిగితే కుటుంబ నిర్ధారణకు సంబంధించిన రేషన్‌కార్డు సమస్యతో ఆగిందని తెలిసింది. ఎప్పుడు మాఫీ జరుగుతుందో ప్రభుత్వమే చెప్పాలి.

– బుగ్గరాంరెడ్డి, తులేకలాన్

మళ్లీ దరఖాస్తు చేశాం



ఇబ్రహీంపట్నం: మా నాన్న మాద్గుల పాపిరెడ్డి పేరుపై రూ.1.14 లక్షల పంట రుణం తీసుకున్నాం. రెండో విడతలో మా పేరు రాలేదు. కుటుంబ నిర్ధారణకు సంబంధించిన వివరాలు సరిగా లేని కారణంగా మాఫీ నిలిచిపోయిందని అధికారులు చెబుతున్నారు. తిరిగి అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకున్నాం. ఎప్పటిలోగా మాఫీ జరుగుతుందోనని ఎదురుచూస్తున్నాం.

– ప్రశాంత్‌రెడ్డి, పొల్కంపల్లి

సంతోషంగా ఉంది



ఇబ్రహీంపట్నం: లక్ష రూపాయల పంట రుణం తీసుకున్నాం. రుణమాఫీ జాబితాలో మా పేరు ఉండడం చాలా సంతోషంగా ఉంది. తిరిగి పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడి నిమిత్తం కొత్త రుణం తీసుకుంటాం. రైతుల అభ్యున్నతికి రుణ మాఫీ ఎంతో దోహదం చేస్తుంది.

– ఉదుతల శేఖర్‌గౌడ్, కప్పాడ్

రెన్యువల్ చేసుకోలేదని..



చేవెళ్ల: నాకు మూడెకరాల భూమి ఉంది. 2020లో చేవెళ్లలోని ఎస్‌బీఐలో రూ.98,400 రుణం తీసుకున్నాను. పంటలు సక్రమంగా పండక అప్పు చెల్లించలేకపోయా. నాలుగేళ్లుగా వడ్డీ పెరిగిపోయింది. రుణమాఫీతో అప్పు తీరుతుందని ఆశ పడ్డా. రెండు విడతలుగా వచ్చిన మాఫీలో పేరు లేదు. ఏమైందని బ్యాంకులో అడిగితే రెన్యువల్ చేసుకోలేదని.. అందుకే నీ ఖాతా ఎన్‌పీఏలో ఉందని.. అసలు, వడ్డీ మొత్తం కలిపి రూ.1.42లక్షలు కట్టి రెన్యువల్ చేసుకోవాలని చెబుతున్నారు. ఇప్పుడు ఇంత పెద్ద మొత్తం ఎలా తీర్చాలి. ప్రభుత్వమే న్యాయం చేయాలి.

– ఎండీ మక్బుల్, రైతు, రామన్నగూడ, చేవెళ్ల మండలం

ముందే స్పష్టత ఇవ్వాల్సింది



చేవెళ్ల: నేను పెన్షనర్‌ను. నాకు ఐదెకరాల భూమి ఉంది. చేవెళ్ల ఎస్‌బీఐలో రూ.99వేల రుణం తీసుకున్నాను. రుణమాఫీ రాలేదు. ఏమైందని అడిగితే నీ సర్వీస్ పెన్షనర్ ఉన్నందున ఆగినట్లుందని అంటున్నారు. అసలు వస్తుందా రాదా అనేది తెలియదు. అందరికీ రుణమాఫీ అని చెప్పి ఇప్పుడు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఉద్యోగం, పింఛన్ అంటూ నిలిపివేయడం సరైంది కాదు. ప్రభుత్వం ముందే స్పష్టత ఇవ్వాల్సింది. అప్పుడు మేము తిరగాల్సిన అవసరం ఉండేది కాదు.

– కె.సత్తయ్య, రైతు, న్యాలట

వివరాలు లేవని..



చేవెళ్ల: నాకున్న పొలంపై చేవెళ్లలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 2023లో రూ.1.36లక్షల రుణం తీసుకున్నా. ఏడాది క్రితం తీసుకున్న రుణానికి కూడా మాఫీ కాలేదు. అడిగితే నీ కుటుంబసభ్యుల వివరాలు తెలపాలని ఉందని అధికారులు చెబుతున్నారు. రేషన్‌కార్డు లేకపోవడంతో వివరాలు అడుగుతున్నారని చెప్పడం విడ్డూరంగా ఉంది.

– జి.మల్లారెడ్డి, రైతు, గుండాల



మొయినాబాద్: ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు తైదల రాజశేఖర్. మొయినాబాద్ మండలం మోత్కుపల్లికి చెందిన ఇతను రూ.95 వేలు పంట రుణం తీసుకున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత రూ.లక్షలోపు రుణమాఫీలో రుణం మాఫీ కాలేదు. రెండో విడత రూ.1.50 లక్షల రుణ మాఫీలోనూ మాఫీ కాలేదు. ఎందుకు కాలేదని వ్యవసాయాధికారులను సంప్రదిస్తే కుటుంబంలో ముగ్గురు రుణాలు తీసుకున్నారని.. ముగ్గురు ఒకే కుటుంబంగా రేషన్ కార్డు ఉందని చెప్పారు. ముగ్గురికి కలిపి రూ.2 లక్షల వరకు రణమాఫీ అవుతుందని తెలిపారు. రాజశేఖర్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొత్త రేషన్ కార్డు మంజూరు చేయకపోవడంతో తల్లిదండ్రులు, తమ్ముడితో కలిసి ఉన్న పాత కార్డే ఉంది. దీంతో రాజశేఖర్‌కు రుణమాఫీ రాలేదు. రాజశేఖర్ తండ్రి అంజయ్య రూ.1.15 లక్షలు, తమ్ముడు జనార్దన్ రూ.80 వేలు రుణం తీసుకున్నారు. ప్రస్తుతం ముగ్గురు వేర్వేరుగా ఉంటున్నా రేషన్ కార్డు ఒకటే ఉండటంతో ముగ్గురికీ మాఫీ కాలేదు.



కందుకూరు పీఏసీఎస్‌లో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న రైతులు

ఒకే ఐడీ పేరుతో ఉందన్నారు



నాగర్‌గూడ ఎస్‌బీఐలో మా నాన్న చిల్కూర్ నర్సింలు రూ.44వేలు అప్పు తీసుకున్నాడు. ఆయన మృతి చెందిన తర్వాత నేను రూ.52వేలు రుణం తీసుకున్నా. ఇద్దరి రుణాలు మాఫీ కాలేదు. ఎందుకు కాలేదని బ్యాంకు అధికారులను సంప్రదించగా ఒకే ఐడీ పేరుతో రెండు లోన్లు ఉండడం కారణంగా మాఫీ కాలేదని చెప్పారు.

– చిల్కూర్ ఆనందం, రైతు, రుద్రారం, షాబాద్ మండలం

లిస్టులో పేరు రాలేదు



కందుకూరు: ఏడాదిన్నర క్రితం సొసైటీ ద్వారా రూ.లక్ష రుణం తీసుకున్నాను. రెండో విడతలో మాఫీ అవుతుందని ఎదురు చూశా. తీరా సొసైటీకి వచ్చి చూస్తే లిస్టులో పేరు రాలేదు. ఏమైందో తెలియదు. వివరాలు పరిశీలిస్తామని అధికారులు చెప్పారు.

– బాలమల్లేష్‌యాదవ్, రైతు, బాచుపల్లి

మొత్తం మాఫీ అయింది



కందుకూరు: నాకు మూడు ఎకరాల భూమి ఉంది. రెండేళ్ల క్రితం సొసైటీలో రూ.55 వేల రుణం తీసుకున్నాను. మిత్తితో కలిపి దాదాపు రూ.61 వేల వరకు అయింది. మొత్తం రుణం మాఫీ అయింది. చాలా సంతోషంగా ఉంది.

– బీరప్ప, రైతు, గుమ్మడవెల్లి

రెండు విడతల్లోనూ మాఫీ కాలేదు



తలకొండపల్లి: స్థానిక యూనియన్ బ్యాంక్‌లో 2020 సంవత్సరంలో రూ.50 వేలు రుణం తీసుకున్నా. మొదటి, రెండో విడుత ప్రభుత్వం చేసిన రుణమాఫీలో నా రుణం మాఫీ కాలేదు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లా.

– నిర్మల, మహిళా రైతు, రాంపూర్, తలకొండపల్లి మండలం

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



గిరిజన విద్యార్థుల సంప్రదాయ నృత్యం

కడ్తాల్: ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యేతోపాటు జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి రామేశ్వరి దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసి, గిరిజనులకు అన్ని విధాలా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. అటవీ హక్కుల అమలుకు చర్యలు తీసుకుంటోందని వివరించారు. పోడు భూములకు పట్టాలిచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, ఏటీడీఓ వెంకటయ్య, సీఐ శివప్రసాద్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, మాజీ సర్పంచ్‌లు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

'నయానగరి'కి సహకరించండి



యాచారంలోని తన నివాసంలో రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి

యాచారం: నయానగరి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని, భవిష్యత్తులో యాచారానికి మహర్దశ పట్టనుందని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం ఫార్మాసిటీ రైతులతో సమావేశమయ్యారు. తమ పట్టా భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీజీఐఐసీ పేరున మార్చిందని కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లికి చెందిన కర్షకులు తెలిపారు. వీటిని తమ పేర్ల పైకి మార్చాలని కోరారు. నయానగరి కోసం బలవంతంగా భూములు తీసుకోవద్దని, ఆసక్తి కలిగిన వారు ఇస్తే అభ్యంతరం చెప్పబోమని వివరించారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీ ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ భూముల్లో నయానగరి నిర్మాణం చేపడుతోందన్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల మధ్య 19,333 ఎకరాల్లో నిర్మించ తలపెట్టిన ఫోర్త్‌సిటీతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. రైతులు ఇందుకు సహకరించాలని కోరారు. పట్టా భూములను టీజీఐఐసీ పేరున మార్చిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు దెంది రాంరెడ్డి తదితరులు ఉన్నారు.


తుపాకీతో కాల్చి.. కత్తులతో నరికి రౌడీ షీటర్ హత్య

- కారుతో ఢీకొట్టి.. కళ్లల్లో కారం చల్లిన దుండగులు
- బాలాపూర్ పీఎస్ పరిధిలో ఘటన
- పాత కక్షలే కారణమని భావిస్తున్న పోలీసులు
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు సీపీ వెల్లడి





రియాజుద్దీన్ (ఫైల్)



పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్ షెల్

పహాడీషరీఫ్: బైక్‌పై వెళ్తున్న రౌడీషీటర్‌ను గుర్తు తెలియని దుండగులు కారుతో ఢీ కొట్టి.. కళ్లల్లో కారం చల్లి.. తుపాకీతో కాల్చి.. కత్తులతో నరికి చంపిన సంఘటన బాలాపూర్ పీఎస్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ షరీఫ్‌నగర్‌లో నివాసం ఉండే రియాజుద్దీన్ అలియాస్ మెంటర్ రియాజ్(45) ప్రస్తుతం లలితాబాగ్ రక్షాపురంలో పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం రాత్రి రాయల్ కాలనీలో జరిగిన ఓ విందుకు హాజరై.. స్నేహితుడు నజీర్ కలిసి బాలాపూర్ లోని తిరుమల వైన్స్‌లో మద్యం తాగారు. అనంతరం రాత్రి 10.30 గంటలకు నజీర్ ఇంటికి వెళ్లగా, రియాజ్ తన బైక్‌పై షరీఫ్ నగర్‌కు బయల్దేరాడు. ఆర్సీఐ రోడ్డులో 'మంచి' స్కూల్ వద్దకు రాగానే ముందస్తు పథకంలో భాగంగా వెనుక నుంచి కారులో వచ్చిన దుండగులు బైక్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో రియాజ్ కింద పడిపోగా.. కళ్లల్లో కారం చల్లి, తుపాకీతో ఛాతిలో ఒక రౌండ్ కాల్పులు జరిపారు. అయినప్పటికీ కొన ఊపిరితో ఉన్నాడని భావించి కత్తులతో తల, ఛాతి భాగాల్లో ఇష్టానుసారంగా పొడిచి, వచ్చిన కారులోనే పరారయ్యారు. కొద్దిసేపటి తర్వాత వాహనదారుల ద్వారా సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా.. రక్తపు మడుగులో పడిఉన్న రియాజ్ అప్పటికే మృతి చెందాడు. ఫైరింగ్ కేసు కావడంతో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, బాలాపూర్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్లు భూపతి, గురువారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. హత్యకు వినియోగించిన బుల్లెట్ షెల్‌తో పాటు ఐరన్ రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీంతో శాంపిళ్లు సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పాత కక్షల కారణంగానే హత్య జరిగి ఉంటుందని, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని సీపీ తెలిపారు. సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక ఆధారాలతో అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

యుక్త వయసు నుంచే నేరాల బాట

మొదట్లో హఫీజ్‌బాబానగర్ 'సి' బ్లాక్‌లో నివాసం ఉండే రియాజ్ యుక్త వయసు నుంచే నేరాల బాట పట్టాడు. ఈ క్రమంలో కంచన్‌బాగ్ పోలీసులు 2004లో రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఇతనిపై మొత్తం ఆరు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2013లో గ్యాంగ్‌స్టర్ అయూబ్‌ఖాన్ బావమర్ది ఫజల్ హత్య కేసులో కీలక నిందితుడిగా ఉన్నాడు. ఫజల్ అనుచరులే ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా రియాజ్‌తో పాటు మద్యం సేవించిన నజీర్ ఇచ్చిన పక్కా సమాచారంతోనే నిందితులు వెంబడించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్‌: అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌, రైల్వేస్టేషన్‌, మెయిన్‌రోడ్డు, మహబూబ్‌నగర్‌ రోడ్డులో సీఐ విజయకుమార్‌, రూరల్‌ సీఐ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి కిరాణా షాపులు, పాన్‌షాపులు, లాడ్జీలు, వ్యాపార సముదాయాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, గుట్కా, మత్తు పదార్థాల అమ్మకాలపై ఆరా తీశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలతో పాటు డ్రగ్స్‌, గుట్కా, ఇతర మత్తు పదార్థాల క్రయ విక్రయాలపై దృష్టి సారించినట్టు తెలిపారు. లాడ్జీల్లో అపరిచిత వ్యక్తులు బసచేయడం, రద్దీ ప్రాంతాల్లో దొంగలు, పాత నేరస్తుల కదలికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకోసం గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎక్కడ గంజాయి, గుట్కా, మత్తు పదార్థాల క్రయ విక్రయాలు జరిగినా, అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు సమాచారం అందించవచ్చని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. కాలనీల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఓ కిరాణ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ రంగస్వామి

రైతు 'రుణం' తీరిందా!

గైడ్‌లైన్స్‌ గడబిడ

- మాఫీకాని రైతుల ఆందోళన
- దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్‌ వరంగల్‌ డిక్లరేషన్‌లో భాగంగా అధికారంలోకి వచ్చాక రైతు రుణమాఫీ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. మూడు విడతల్లో రూ.31కోట్లు మాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటికే జులై 18, జులై 30న రెండు విడతల్లో రూ.1.50లక్షల లోపు క్రాప్‌లోన్‌ బకాయిలు విడుదల చేసింది. ఈ ప్రక్రియ కొందరికి మోదం.. మరికొందరికి ఖేదంగా మారింది. మాఫీ అయిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తుంటే కాని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు మాఫీ జరుగుతుందా లేదా అనే సందిగ్ధంలో ఉన్నారు. అర్హత ఉన్నా బకాయి తీరని రైతులు వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 22వేల మంది రైతులుంటే 8వేల మంది రుణాలు తీసుకున్నారు. ఇందులో తొలి విడతలో 2,306 మంది రైతులకు 11.73కోట్లు, రెండో విడతలో 1,346 మంది రైతులకు 10.97కోట్లు మాఫీ అయినట్టు సమాచారం.

30శాతమే మాఫీ

యాచారం: కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ మండల పరిధిలో 30శాతం మంది రైతులకే అందింది. దీంతో మాఫీ కాని రైతులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు రూ.2లక్షలు మాఫీ చేస్తామని ప్రకటించి అధికారం చేపట్టాక నిబంధనల పేరిట కోత విధించడం సరికాదంటూ మండి పడుతున్నారు. యాచారం పీఏసీఎస్‌ పరిధిలో 1,853 మంది రైతులు రూ.2లక్షల లోపు రుణం తీసుకోగా ఇందులో మొదటి విడతలో 1,169 మంది రైతులకు గాను 447 మంది రైతులకే మాఫీ వర్తించింది. రూ.లక్షన్నర లోపు 681 మంది రైతులకుగాను కేవలం 178 మంది రైతులకే మాఫీ అయింది. రూ.2లక్షల వరకు అర్హులైన రైతులు 684 మంది ఉండగా.. ఎంత మందికి వర్తిస్తుందోననే ఆందోళనలో ఉన్నారు.

'రెన్యూవల్‌'తో అనర్హత

కడ్తాల్‌: మండల పరిధిలో 17,734 మంది పట్టాదారులుండగా రెండు విడతల రుణమాఫీలో 3,653 మందికి రూ.1.50లక్షల లోపు మాఫీ అయింది. 2018 డిసెంబర్‌ 12 నుంచి 2023 డిసెంబర్‌ 9వ తేదీ వరకు తీసుకున్న రూ.2లక్షల లోపు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం కటాఫ్‌ విధించింది. కాగా కటాఫ్‌ డేట్‌కు ముందు రుణం తీసుకుని అదే లోన్‌ నంబర్‌పై రెన్యూవల్‌ చేసుకున్న రైతుల రుణమాఫీ వర్తించలేదు. కొంత మంది రైతులు తమ పంట రుణాలు(రుణ ఖాతా క్లోజ్‌ చేయడం) చెల్లించడంతో ఆ రైతులకు సైతం క్రాప్‌లోన్‌ మాఫీ అవ్వలేదు. ఆధార్‌ మిస్‌మ్యాచ్‌ కారణంగా చాలా మంది రైతులకు అర్హత ఉన్నప్పటికీ మాఫీ కాలేదు. ఈ ఇబ్బందులతో మాఫీ కాని రైతులు ఇప్పటికే వ్యవసాయ శాఖ కార్యాలయంలో 500 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు.



కేశంపేట: రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి శిరీష

రెండు విడతల్లో 5,520 మందికి మాఫీ

తలకొండపల్లి: మండల పరిధిలో సుమారుగా 30 వేల ఎకరాల సాగు భూమి ఉండగా, 20 వేల మంది రైతులున్నారు. దాదాపు 10,230 మంది రైతులు రూ.80 కోట్ల క్రాప్‌లోన్‌ తీసుకున్నారు. మొదటి విడతలో 3,853 మంది రైతులకు రూ.23.31 కోట్లు, రెండో విడతలో 1,667 మంది రైతులకు 16.51 కోట్లు నేరుగా రైతు ఖాతాలో జమ చేసినట్లు ఏఓ రాజు తెలిపారు. రేషన్‌ కార్డు, ఆధార్‌ కార్డు, బ్యాంక్‌ అకౌంట్‌ తదితర వివరాల్లో సమస్యల కారణంగా రుణమాఫీ నిలిచిందని ఇప్పటికే 150 మంది రైతులు దరఖాస్తులు సమర్పించారని ఏఓ వివరించారు. ఇప్పటికే నివేదికను ఉన్నతాధికారులకు పంపిచామన్నారు.

మాఫీ కొందరికే..

మొయినాబాద్‌: మండల పరిధిలో మొత్తం 21,576 మంది రైతులు ఉన్నారు. వీరిలో సుమారు 6,500 మంది రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్నారు. ఇందులో మొదటి విడత రూ.1 లక్ష వరకు 1,616 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. రెండో విడత రూ.1.50 లక్షల వరకు 672 మంది రైతులకు రుణమాఫీ వచ్చింది. మూడో విడతలో రూ.2 లక్షల వరకు ఎంత మంది రైతులకు రుణ మాఫీ వస్తుందో తెలియని పరిస్థితి. చాలా మంది రైతులకు రుణమాఫీ రాకపోవడంతో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌, రేషన్‌ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం పట్టుకుని బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీ రాని రైతులు వ్యవసాయాధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని ప్రభుత్వం సూచించడంతో మొయినాబాద్‌ మండలంలో ఇప్పటి వరకు సుమారు 200 మంది రైతులు దరఖాస్తులు ఇచ్చారు.

అస్తవ్యస్తంగా రుణమాఫీ

షాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకునేందుకు హడావుడిగా అమలు చేసిన రైతు రుణ మాఫీ అస్తవ్యస్తంగా మారింది. అర్హులైన రైతుల పేర్లు జాబితాలో కనిపించడం లేదు. మొదటి విడతలో రూ.1లక్ష, రెండోవిడత రూ.1.50 లక్షల రుణమాఫీ జాబితాలో కనిపించాయి. బ్యాంకు పాస్‌ పుస్తకంలో అక్షర దోషాలున్నాయని మాఫీ వర్తించలేదు. ఒకే కుటుంబంలో రుణాలపై ఒకే ఐడీ ఉండడంతో మాఫీ వర్తించలేదు. అప్పును రూ.లక్షల్లో పెంచుతూ ఆన్‌లైన్‌ జాబితాలో నివేదించడంలాంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకు అధికారులు రైతుల వివరాలు సేకరించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని అధికారులు చెబుతున్నారు.

గ్రీవెన్స్‌కు 1,306 ఫిర్యాదులు

కేశంపేట: మండలంలో 19,871 మంది రైతులు ఉన్నారు. వీరిలో మొదటి విడుతలో 3,616 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. కేశంపేట గ్రామంలో ఉన్న కెనరా బ్యాంక్‌లో లోన్‌ తీసుకున్న రైతులకు ఎక్కువ శాతం మాఫీ అవ్వలేదు. 2018కి ముందుగా రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా రెన్యూవల్‌ చేసుకున్నారు. బ్యాంకు అధికారులు రుణాలు తీసుకున్న తేదీని ఎంట్రీ చేయడంతో మాఫీ వర్తించలేదు. ఇదే విషయమై మండల వ్యవసాయ అధికారి శిరీష బ్యాంకు అధికారులతో మాట్లాడారు. గ్రీవెన్స్‌లో కెనరా బ్యాంకులో రుణాలు తీసుకున్న వారే 1,306 ఫిర్యాదులున్నట్లు ఆమె తెలిపారు.

సాంకేతిక కారణాలతోనే..

కందుకూరు: రైతు రుణ మాఫీ పథకం సాంకేతిక కారణాలతో అర్హులైన చాలా మంది రైతులకు అందలేదు. మొత్తం మండల వ్యాప్తంగా 19 వేలకు పైగా పట్టాదారులు ఉన్నారు. అందులో అవసరమున్న రైతులు బ్యాంకులు, సొసైటీల నుంచి రుణాలు పొందారు. కాగా రుణాలు పొందిన రైతులకు మొదటి విడతలో 2,848 మందికి, రెండో విడతలో 1,292 మందికి రుణ మాఫీ అయింది. రూ.1.50 లక్షలకు పైగా రుణ పొందిన రైతులు మూడో విడత కోసం నిరీక్షిస్తున్నారు. కాగా ఇప్పటి వరకు రూ.1.50 లక్షల లోపు రుణం పొందిన రైతులకు చాలా మందికి రుణమాఫీ కాకపోవడంతో అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికంగా సాంకేతిక కారణాలే కన్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆధార్‌లో ఉన్న పేరుతో రుణం పొందిన పేరుకు సరిపోలక, రేషన్‌ కార్డులు లేని వారికి, ఖాతాలు మూసివేయడం వంటి కారణాలతో అర్హులైన చాలా మందికి మాఫీ కాలేదు. పీఏసీఎస్‌ల నుంచి వివరాలు నమోదైయ్యే క్రమంలో సాఫ్ట్‌వేర్‌ సమస్యతో ఆధార్‌ ఒకరిది, ఖాతా మరొకరిది నమోదయింది. దీంతో సమస్య ఏర్పడింది. కొంత మంది రైతులవి వేరే జిల్లాలో వచ్చాయి. ప్రస్తుతం అలాంటి రైతుల నుంచి మరోసారి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు సరిచేయడానికి పంపిస్తున్నారు.

అసలు మాఫీ.. వడ్డీ వసూలు

చేవెళ్ల: మండల పరిధిలోని సహకార బ్యాంకులు, సొసైటీ, కెనరా బ్యాంకుల్లో రైతుల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం అసలు మాఫీ చేసిందని.. వడ్డీ వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం, బ్యాంక్‌, వ్యవసాయ అధికారులు స్పందించి మూడో విడత రుణమాఫీలోగా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. డివిజన్‌ పరిధిలోని నాలుగు మండలాల్లో రెండు విడతల్లో 11,147 మందికి రుణమాఫీ అయిందని అధికారులు వెల్లడించారు. జాబితాల్లో అర్హులైన రైతులకు సైతం మాఫీ వర్తించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. దాదాపు 300 మంది రైతులు తమకు రుణమాఫీ అవ్వడం లేదని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

రుణమాఫీ కావడం సంతోషం

మొయినాబాద్‌రూరల్‌: నాకు ఆరు ఎకరాల పొలం ఉంది. 2009 నుంచి ఎస్‌బీఐ మొయినాబాద్‌ బ్రాంచిలో ఏటా పంట కోసం రుణం తీసుకుంటాను. గత సంవత్సరం రూ.99 వేలు తీసుకున్నాను. ఇటీవల ప్రభుత్వం చేసిన రుణ మాఫీతో లబ్ధి చేకూరింది. దీంతో పంట రుణం రెన్యూవల్‌ చేసుకునేందుకు మూడు రోజుల క్రితం బ్యాంక్‌కు వెళ్లాను. రుణమాఫీ జరిగిందని వడ్డీ డబ్బులు కడితే సరిపోతుందని చెప్పారు. రుణమాఫీ అయిందని చెప్పగానే సంతోషమేసింది.



– సోమ మహేశ్‌, రైతు, నదీమ్‌నగర్‌

మూడో లిస్టు తర్వాతే వివరాలు

యాచారం: నింబంధనల ప్రకారం రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. ఇప్పటి వరకు 150 మందికి పైగా రైతులు దరఖాస్తులు ఇచ్చారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేకపోయినప్పటికీ వారు అడిగిన వెంటనే పంపించేందుకు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. మూడో విడత లిస్టు వస్తేనే పూర్తి వివరాలు అందుతాయి.

– సందీప్‌కుమార్‌, వ్యవసాయాధికారి

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE R. R. DISTRICT AT L.B. NAGAR
O. S. No 454 OF 2024

BETWEEN:
Inderjeet Gogikar and 2 others. ...Plaintiffs
AND
The Tahsildar/ The Mandal Revenue Officer, Saroomagar Mandal, R. R. District and 3 others ...Defendants

To,
All Concerned

Take notice That the Plaintiffs herein have filed the above suit for declaration to declare the Plaintiff No's. 1 to 3 are the legal heirs of the deceased Gogikar Shivaj, S/o Gogikar Kanniah lal and Gogikar Varalaxmi, W/o. Gogikar Shivaji and to further declare that the plaintiffs are the absolute owners and possessors of the Schedule "A" Property all that premises Bearing H.No.11-20-09 on Southern Part in Shop-Cum Flat No. 8, Plot No. 8 admeasuring 105.26 Sq. Yds., or 98.01 Sq. Mts., in Sy. No.5, Ward No.11, situated at Saroornagar Commercial Complex of Saroomagar Village & Mandal, under the limits of L.B. Nagar. R. R District and bounded by North: Part of Plot No. 8. South: Plot No. 9. East-5 MT. Wide Road, West: 9 MT. Wide Road, Schedule "B" Property all that the House Property Bearing Municipal No.13-3-396/22/1/D, :Consisting of Ground, First Floor and Second Floor; on Plot No. 37, admeasuring 100.00 Square Yards or 83.6 Square Meters, situated at Sai Durga Nagar. Jiaguda, Hyderabad, T.S., and bounded by North: Neighbour's House, South: House No. 13-3-396/36, East: Neighbour's House, West: 20'-0" Wide Road and Schedule "C" Property all that the Ground Floor, Bearing Municipal No.14-2-26, admeasuring 599.00 Square Feets and undivided share of land is 23.66 Square Yards or 19.78 Square Meters situated at Chakanawadi, Gosha Mahal, Hyderabad, T.S., and Bounded by North: Neighbour's Property, South: Neighbour's House No. 14-2-27, East: Road, West: Lane. The above suit is posted on 27-08-2024. If any person or persons having, any right, title, claim and interest in respect of the claims made by the plaintiffs, they may appear before the said Hon'ble court at 10:30 a.m. in person or through advocate, failing which the matter will be decided on merits.

//By order of the Hon'ble Court//

M/s. V. LAXMAN, V. Raju Goud, D. Bhuvaneshwari,
Advocates
Flat No.G1, Vijetha Laxmi Residency, Saleemnagar, Malakpet, Hyderabad -36.
Counsel for Plaintiffs

ఫీవర్‌ సర్వే చేపట్టండి

- మెరుగైన వైద్య సేవలందించాలి
- అభాగ్యులను ఆలన పాలియేటివ్‌ కేర్‌లో చేర్పించాలి
- డివిజన్‌ వైద్యాధికారుల సమీక్షలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్‌

చేవెళ్ల: డివిజన్‌ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఫీవర్‌ సర్వే చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్‌ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇటీవల కొత్తగా వచ్చిన వైద్యాధికారులు, పారామెడికల్‌ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బదిలీల్లో డివిజన్‌కు నలుగురు కొత్త వైద్యులతో పాలుగా 41 మంది పారామెడికల్‌ సిబ్బంది వచ్చారన్నారు. ఈ సందర్భంగా పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి వైద్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం దామోదర్‌ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆస్పత్రుల్లో ఓపీ సేవలను విస్తరించాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అభాగ్యులను ఆలన పాలియేటివ్‌ కేర్‌లో చేర్పించి వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సంతోష, బలరాం, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో సమావేశమైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్‌

యువకుడి అదృశ్యం

మొయినాబాద్‌: పనికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దమంగళారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్లగల్ల హరిబాబు(28) పదిహేను రోజులుగా మండల పరిధిలోని భాస్కర మెడికల్‌ కళాశాలలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 5న ఉదయం పనికి వెళ్లిన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎక్కడా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



హరిబాబు(ఫైల్‌)

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఏసీపీ బాలాజీ నాయక్‌

చేవెళ్ల: లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడుపొద్దని రాజేంద్రనగర్‌ డివిజన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ బాలాజీ నాయక్‌ సూచించారు. మండల కేంద్రంలోని సిల్వర్‌ డేల్‌ ది హైస్కూల్‌లో శుక్రవారం చేవెళ్ల ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌.వెంకటేశం ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మైనర్ల వాహనాలు నడుపుతూ వారి ప్రాణాలతో పాటుగా ఎదుటి వారి ప్రాణాలకు సైతం ప్రమాదాలు కలిగిస్తున్నారన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితో పాటుగా వాహన యజమానిపై కఠిన చర్యలుంటాయన్నారు. ట్రిపుల్‌ రైడింగ్‌, ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయడం, రాంగ్‌రూట్‌, రాష్‌ డ్రైవింగ్‌, డ్రంకెన్‌డ్రైవ్‌ చేయడం ట్రాఫిక్‌ ఉల్లంఘనలే అని చెప్పారు. విద్యార్థులు జీబ్రా కాసింగ్‌ లైన్స్‌, ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ వద్దనే రోడ్డు దాటాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ తప్పక ధరించాలని సూచించారు. కారులో సీటు బెల్ట్‌ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌ మోనాచారి, ప్రిన్సిపాల్‌ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన ఆటో

మైలార్‌దేవ్‌పల్లి: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును గూడ్స్‌ ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన వెంకయ్య తన అశోక్‌ లేలాండ్‌ గూడ్స్‌ ఆటోలో డ్రైవర్‌ లింగయ్యతో కలిసి శుక్రవారం గుడిమల్కాపూర్‌ కూరగాయల మార్కెట్‌కు వచ్చారు. ఇక్కడి నుండి కూరగాయలు తీసుకొని తిరుగు ప్రయాణంలో పల్లెచెరువు వద్ద ఆగి ఉన్న రాజేంద్రనగర్‌ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును వెనుక నుండి ఢీకొట్టారు. దీంతో బస్సు అద్దాలు, గూడ్స్‌ ఆటో ధ్వంసమయ్యాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలవగా..ఆటో యజమాని వెంకయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానిక హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్‌ జంగోజీ పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు నెలల్లో పరిష్కారం

రోడ్డు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయంజాల్‌: మున్సిపల్‌ పరిధిలోని ప్రధాన సమస్యలకు మూడు నెలల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తుర్కయంజాల్‌, రాగన్నగూడలోని పలు కాలనీల్లో పర్యటించారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. అనంతరం ఆయా కాలనీల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కమిషనర్‌ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడం, శిథిలావస్థకు చేరిన భవనాల తొలగింపు, ఇంటింటికీ మొక్కల పంపిణీ, యాంటీ లార్వా స్ప్రే చేయడం తదిదర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ చైర్‌పర్సన్‌ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్‌ గౌడ్‌, కౌన్సిలర్లు మాధవి, కీర్తన, మంగమ్మ, ఆర్‌.ఓ. శ్రీనివాసులు, డీఈ సత్యనారాయణ, ఏఈ భిక్షపతి, సానిటరీ ఇన్స్‌పెక్టర్‌ ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌: మల్‌రెడ్డితో కాలనీవాసులు

మౌలిక వసతుల కల్పనకు సహకారం

హయత్‌నగర్‌: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్‌ మున్సిపల్‌ పరిధిలోని 15వ వార్డులో మునుగనూరు వేద విద్యానగర్‌ కాలనీలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి అతిథి గా విచ్చేశారు ఈ సందర్భంగా మా ట్లాడుతూ.. ఆలయానికి మౌలిక సదుపాయాల కల్పనకు సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ హరితాగౌడ్‌, కౌన్సిలర్‌ స్వాతిరెడ్డి, సునీల్‌ రవీందర్‌రెడ్డి, వర్షన్‌, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్‌కు తీసుకెళ్లి.. శవంగా మార్చారు



భాస్కర ఆస్పత్రి వద్ద బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన

- మహిళ ప్రాణం తీసిన వైద్యుల నిర్లక్ష్యం
- ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన

మొయినాబాద్‌: కాలికి గాయమై నడుచుకుంటూ ఆస్పత్రికి వెళ్లిన తన భార్యను.. శవంగా తిరిగిచ్చారని మృతురాలి భర్త రోదించాడు. వైద్యుల నిర్లక్ష్యం తమ తల్లి ప్రాణాలను పొట్టన పెట్టుకుందని కూతుళ్లు విలపించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌ పీఎస్‌ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, మృతురాలి బంధువుల వివరాల ప్రకారం.. అమ్డాపూర్‌ గ్రామానికి చెందిన మద్దెపాగ రమేశ్‌ భార్య సావిత్రి(30) ఐదు రోజుల క్రితం ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కింద పడింది. దీంతో కాలికి గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను అమ్డాపూర్‌ చౌరస్తాలోని భాస్కర ఆస్పత్రికి తరలించగా కాలు విరిగిందని, ఆపరేషన్‌ అవసరమని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం శస్త్రచికిత్స కోసం థియేటర్‌లోకి తీసుకెళ్లారు. సాయంత్రమైనా సావిత్రిని కుటుంబ సభ్యులకు చూపించలేదు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతో థియేటర్‌లోకి అనుమతించారు. అప్పటికే ఆమె అపస్మారక స్థితిలో ఉండటంతో ఏం జరిగిందని డాక్టర్లను ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో బంధువులు , గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కొద్దిసేపటి తర్వాత అక్కడకు చేరుకున్న పోలీసులకు సావిత్రి మృతి చెందిందని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన స్థానికులు ధర్నాకు దిగారు. మృతురాలికి భర్త రమేష్‌, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రమేశ్‌ ఇదే ఆస్పత్రిలో దినసరి కూలీగా పనిచేస్తున్నారు. ఇంత జరిగినా ఆస్పత్రి యాజమాన్యం మాత్రం తమ తప్పేమీలేదన్నట్లు వ్యవహరిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయకుండా ఉండేందుకు బాధిత కుటుంబ సభ్యులతో బేరసారాలు చేస్తున్నట్లు బంధువులు ఆరోపించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



సావిత్రి(ఫైల్‌)